క్లుప్తంగా

వేమన పద్యాల పోటీ రేపు

పలమనేరు: వేమన జయంతి సందర్భంగా జాతీయ వేమన పద్యాల పోటీలను ఈనెల 18 నిర్వహించనున్నట్టు స్థానిక తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా వేమన పద్యాలను చెప్పగలిగే పిల్లలు ఇప్పటికే వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి పోటీలను రేపు నిర్వహించి గెలుపొందిన పిల్లలకు అదే రోజు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు అందులో పేర్కొన్నారు.

ప్రయాణికుల రద్దీ



సదుంలో బస్సు కోసం బారులు

సదుం: సంక్రాంతి పండుగ ముగియడంతో స్వస్థలాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం కావడంతో గురువారం బస్సుల్లో రద్దీ నెలకొంది. సదుం నుంచి పుంగనూరు, తిరుపతి, బెంగళూరుకు వెళ్లే బస్సుల్లో అధిక రద్దీ నెలకొంది. ఈ నేపథ్యంలో పలువురు బస్సుల్లో నిల్చునే ప్రయాణించారు. పండుగ సెలవులు ముగిసే వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఓబుల్‌రాజు

పలమనేరు: రెవెన్యూ శాఖ నిర్వహించిన సదస్సులో భారీగా వచ్చిన సమస్యలపై అధికారులు చొరవ చూపి వాటిని పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఓబుల్‌రాజు సూచించారు. ఆమేరకు స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా సంఘ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సులు నిర్వహించడం బాగుంది గానీ వాటిని పరిష్కరిస్తేనే అధికారులపై రైతులకు నమ్మకం ఉంటుందన్నారు. ఇందులో వచ్చిన 90 శాతం సమస్యలు కేవలం సిబ్బంది నిర్లక్ష్యంతోనే వచ్చాయన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సైతం చొరవ చూపాలని కోరారు. సంఘ నేత శివకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతు దీక్షలు



దీక్ష చేస్తున్న రైతులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం వద్ద ఉన్న జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతుల నిరసన దీక్షలు 11వ రోజుకు చేరుకుంది. జెల్లీ ఫ్యాక్టరీ వల్ల తమ గృహాలు, పొలాలు, ఆరోగ్యాలు పాడవుతున్నాయని రైతులు 11 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందారు. జిల్లా అధికారులైనా మాపై దయ చూపాలని రైతులు కోరుతున్నారు.

సీఎం జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న మురళీనాథ్

పలమనేరు: గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల విషయంగా ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకున్న ఉద్యోగుల మూడు విభాగాల వర్గీకరణ అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ సచివాలయాల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీనాథ్ తెలిపారు. ఆమేరకు స్థానిక సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆమోద్య యోగం అయినప్పటికీ వాటి అమలుపై తమ సంఘ నేతల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రభుత్వం మరింత క్లారిటీగా ముందుకెళితే బాగుంటుందని తెలిపారు.

తమలపాకులా మజాకా!

- కట్ట తమల పాకులు రూ.150
- మరింత పెరగనున్న ధరలు
- క్రమేనా తగ్గుతున్న ఆకు తోటల సాగు
- కర్ణాటక నుంచి దిగుమతులు
- అంతరిస్తున్న వారపు సంతల సంస్కృతి





కల్లాడు వద్ద తమలపాకు తోట

పలమనేరు: మనిషి దైనందిన జీవితంలో తమల పాకులకు ఓ ప్రత్యేక స్థానముంది. ఆలయాల్లో పూజల నుంచి ఏ శుభకార్యం జరిగినా తమలపాకు లుండాల్సిందే. ఇక తాంబూల ప్రియులకు రోజూ తమలపాకు ఉండాల్సిందే. అయితే మంచు కారణంగా తోటల్లో పంట దిగుబడి తగ్గింది. దీంతో తమలపాకులకు ఇప్పుడు భలే డిమాండ్ వచ్చిపడింది. దీంతో తమలపాకు ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని దుకాణాల్లో కట్ట తమలపాకులు(వంద) ధర రూ.150 దాకా ఉంది. దీంతో సామాన్యులు తమలపాకుల ధరతో బెంబేళెత్తుతున్నారు. వచ్చే మార్చిదాకా తమలపాకు తోటల్లో తీగెలు దించే కాలం కాబట్టి డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణమైందని తమలపాకుల వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా ఇలాంటి అగ్గి ధరల్లో తాంబూలం వేసినట్టేని తాంబూలం ప్రియులకు ఆందోళన తప్పడం లేదు.

స్థానికంగా తగ్గిన సాగు

జిల్లాలోని పడమటి ప్రాంతంలో తాంబూలం వేసే గ్రామీణుల సంఖ్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో చాలామందికి తాంబూలం వేయడం ఇప్పటికీ అలవాటు. దీంతో పాటు అన్ని శుభకార్యాలకు, ఆలయాల్లో పూజలకు కచ్చితంగా తమలపాకులుండాల్సిందే. ఈ ప్రాంతంలో గతంలో 600 దాకా తమలపాకు తోట లుండేవి. కాలక్రమేనా వీటి సాగు తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం తమలపాకు తోటలు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో శాంతిపురం, కుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల్లో వంద తోటలకు పడిపోయింది. ఒక్కసారి తమలపాకు తోటలను సాగుచేస్తే ముప్పై ఏళ్లపాటు సాగు చేసేవారు. అయితే వీటి నిర్వహణకు ప్రత్యేకంగా మనుషులుండాల్సిందే. పాతతరం నాటి వాళ్లు ఉన్నప్పుడు వీటిని సాగచేసేవారు. నేటి తరంలో వీటిపై పెద్దగా ఆసక్తి తగ్గింది. ఉన్నతోటల్లోనూ ఈ సీజన్‌లో తీగెలను దించే సమయం ఇది. దీంతో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తులు లేవు.

కర్ణాటక నుంచి దిగుమతి

కర్ణాటకలోని తుంకూరు ప్రాంతం నుంచి ఇక్కడికి తమలపాకులు ఎక్కువగా వస్తున్నాయి. అయితే ఇవి లోకల్ తోటల్లోని నాటు రకాలు కావు. కాస్త హైబ్రీడ్‌గా పండించే తమలపాకులను తుంకూరు జిల్లా రైతులు పండిస్తుంటారు. స్థానికంగా సరుకు లేనందువల్ల అక్కడి నుంచి వస్తున్న ఆకులకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా తమలపాకు ధర ఆకాశాన్నంటుతోంది.

కనుమరుగవుతున్న వారపుసంతలు

జిల్లాలోని వందచోట్ల గతంలో వారపుసంతలు జరిగేవి. కాలక్రమేనా సంతల ఉనికి లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో శాంతీపురం సమీపంలోని బొడుమాకులపల్లి, వి.కోట, పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని ముళబాగిల్ ప్రాంతాల్లో వారపు సంతలు నడుస్తున్నాయి. మిగిలిన చోట్ల సంతలు జరగడం లేదు. వారానికోసారి నిర్వహించే సంతలకు స్థానిక వ్యాపారులే కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి పెద్దసంఖ్యలో వ్యాపారులు వచ్చి దుకాణాలను నిర్వహించేవారు. దీంతో సరసమైన ధరలకే వస్తువులు లభించేవి. సంతలు తగ్గడంతో మండల కేంద్రాలు, పట్టణాల్లో వ్యాపారులు రింగుగా ఏర్పడి ఏ దుకాణానికి వెళ్లినా ధరలు ఒకేలా ఉండేలా చేశారు. దీంతో వారు చెప్పినంత ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.



పలమనేరులోని తమలపాకులు

మార్చి దాకా ధరాఘాతమే..



నేను 20 ఏళ్లుగా వారపు సంతలో వ్యాపారం చేస్తున్నా. సాధారణంగా నాటి తమలపాకులు లోకల్ ఆకుతోటల నుంచే మాకు అందేవి. ఇప్పుడు మంచుతోపాటు అన్ సీజన్ కాబట్టి తమలపాకు ధరలు పెరిగాయి. తుంకూరు నుంచి తమలపాకులు ఇక్కడికి వస్తున్నాయి. ధరలు వాళ్లు చెప్పినట్టు కొనాల్సిందే. లోకల్ తమలపాకులు వచ్చేదాకా ధరలు ఎక్కువగానే ఉంటాయి.

–శివప్పస్వామి, తమలపాకుల వ్యాపారి, బైరెడ్డిపల్లి

పదేళ్ల వయసు నుంచి తాంబూలం వేస్తున్న..



నా పదేళ్ల వయసు నుంచి వక్కాకు వేస్తున్నా. ఇపుడు నా వయసు 76 ఏళ్లు. వదలాలంటే బుద్ధి పుట్టదు. అలవాటు చేసుకున్నాం కాబట్టి తమలపాకు రేటు ఎక్కువైనా కొనాల్సిందే. నాకు తెలిసి కట్ట తమలపాకులు రూపాయిగా ఉండి ఇప్పుడు రూ.వందకు పైగా దాటింది. కట్ట ధర రూ.200 అయినా కొనాల్సిందే తాంబూలం వేయాల్సిందే.

–రత్నక్క, కొలమాసనపల్లి, పలమనేరు మండలం

యూరియా వినియోగం తగ్గించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శివకుమార్

పుంగనూరు: పంటలకు యూరియా వినియోగం తగ్గించాలని ఏడీ శివకుమార్ సూచించారు. గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని కపాడంమిట్టపల్లెలోని వేరుశనగ పొలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వేరుశనగ పంటలో జిప్సమ్ వినియోగం గురించి వివరించారు. అలాగే ప్రస్తుతం వేసవి కాలం రానున్న తరుణంలో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. అలాగే రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓలు రాజేష్, ఫయాజ్‌తో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్ మమత పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: పట్టణంలో పలుసేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు శుక్రవారం 900 మంది పేదలకు అన్నదానం చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ చంద్రశేఖర్, ఇంద్రేష్, రఘుపతినాయుడు, రామ్మూర్తి, స్వామి కన్నన్, నాగభూషణం, కేశవరెడ్డి సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ధీరజ్, సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన కనుమ పండుగ



చిట్రెడ్డిపల్లెలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న స్వామివారు

చౌడేపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కోలాహలంగా కనుమ పండుగ జరుపుకున్నారు. చౌడేపల్లె, కోటూరు, వెంగళపల్లె, దుర్గసముద్రం, చిట్రెడ్డిపల్లె గ్రామాల్లో ప్రజలు పశువులను ముస్తాబుచేసి ఊరేగించారు. ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశువుల అభివృద్ధి చెందాలని కోరుతూ పూజలు చేశారు. అనంతరం కాటమరాజుల ఆలయాల వద్ద పూజలు చేసి పశువులను చిట్లాకుప్పల వద్దకు తీసుకెళ్లి చితికి నిప్పంటించారు. ఎటు చూసినా బంధు మిత్రులతో గ్రామాల్లో సందడి నెలకొంది.



వన విహారంలో ఆర్యవైశ్యులు

అట్టహాసంగా వనవిహారం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్యవైశ్య వనవిహార కమిటీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోట్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గురువారం నగరంలోని కట్టమంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పరుగుపందెం, లెమన్ అండ్ స్పూన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్, పాటలు, నృత్యం, రంగువల్లులు, లఘుచిత్ర, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. యువత, మహిళలు, పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చల్లారు ద్వారకనాథ్, మట్టపల్లి శరవణ, ఆరూరు ప్రసాద్, ఎస్సీకే సత్యనారాయణ, పుష్పస్టోర్ చంద్ర, గోవర్ధన్, రవీంద్రబాబు, ఆరూరు రామ్మూర్తి, బైసానీ బాబురావు, బైసాని చంద్రశేఖర రావు, చిలంకూరు వెంకటేష్, సంపత్, రాఘవరావు, రామ్మూర్తి, కిరణ్ పాల్గొన్నారు.

గోట్ సందడి..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కనుమ పండుగ తర్వాత నాడు గోట్ నిర్వహించుకోవడం ఆనవాయితీ. పిల్లలతో గంగినేని పార్కు సందడిగా మారింది.

బాధ్యతగా పనిచేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: సచివాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శుల పనితీరు పారదర్శకంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మున్సిపాలిటీలోని చంద్రమౌలి మార్కెట్‌లోని 2వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఆధార్ కార్డుల నమోదు, సవరణలు తదితర అంశాలను పరిశీలించారు. సచివాలయాల్లో ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాలపై పలు ఆరోపణలు వస్తున్నాయని, ఆరోపణలు రుజువైతే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయడం అలవర్చుకోవాలన్నారు.

కోడెగిత్తల జోరు.. యువకుల హుషారు



టేకుమందలో పరుగులు తీస్తున్న ఎద్దు

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద గ్రామంలో గురువారం ముక్కనుమ సందర్భంగా నిర్వహించిన ఎద్ల పరుగు పందేలు హోరెత్తించాయి. యువకులు కేరింతలు నడుమ ఎద్ల పరుగు పందేలు దుమ్మురేపాయి. పరిసర ప్రాంతాల నుంచి ఎద్లపందేలకు ఎద్దులను తీసుకొచ్చారు. పరుగులు పెడుతున్న ఎద్లను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు గ్రామానికి వచ్చారు. మిద్దెలపై నుంచి ఎద్ల పరుగు పందేలను తిలకించి ఆనందాన్ని పొందారు.

జాగ్రత్తలతో ప్రమాదాలు దూరం



పుంగనూరు: మాట్లాడుతున్న ఎంవీఐ సుప్రియ, డీఎం సుధాకరయ్య

పుంగనూరు: జాగ్రత్తలు తీసుకుంటే రహదారి ప్రమాదాలు నివారించేందుకు వీలుందని ఎంవీఐ సుప్రియ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ సుధాకరయ్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రారంభించారు. భద్రతా వారోత్సవాలు ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తామన్నారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి రోజు ఒక్కో ప్రాంతంలో అవగాహన సదస్సు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలకు కారణం నిర్లక్ష్యమన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, మత్తు పదార్థాలు తీసుకోవడం, అతివేగంగా నడపడం ప్రమాదాలకు కారణమన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్లు ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడంతో పాటు సెల్‌ఫోన్ వినియోగించరాదన్నారు. ప్రమాదాల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబాలు వీధిన పడుతున్న విషయాన్ని వాహన చోదకులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, అసిస్టెంట్ మేనేజర్ మురళీ, డిప్యూటి సూపరింటెండెంట్ సుధాకర్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో ట్రాఫిక్ కష్టాలు



సోమల వైపు వెళ్లే రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- పట్టించుకోని పోలీసులు

చౌడేపల్లె: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రయివేటు బస్టాండు ఆంజనేయస్వామి ఆలయం ఎదుట గురువారం స్తంభించిన ట్రాఫిక్ ఇది. హైస్కూల్‌వీధి, సోమల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో సాయంత్రం అయితే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ బైక్‌లు పార్కింగ్ చేయడంతో పాటు దుకాణాల ముందు బైక్‌లు పార్కింగ్ చేయడంతో సమస్య తీవ్ర తరమవుతోంది. అసలే ఈ ప్రాంతంలో ఇరుకు రోడ్డు కావడంతో పాటు వాహనాల పార్కింగ్‌తో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మూడు బైక్‌లు చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పలుచోట్ల మోటార్ సైకిళ్ల చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొంగారెడ్డిపల్లి, హైరోడ్డు, కట్టమంచి ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉంచిన బైక్‌లు కనిపించడం లేదంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు మోటార్ సైకిళ్ల చోరీ జరిగినట్టు కేసు నమోదు చేసిన పోలీసులు ఓ అనుమానితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- పట్టించుకోని అధికారులు



చెరువులో యంత్రాలతో తరలిస్తున్న మట్టి

కుప్పంరూరల్: కుప్పం పట్టణానికి సమీపంలోని లక్ష్మీపురం చెరువులో నిత్యం మట్టి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు జేసీబీ, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టుకుని మట్టిని తరలిస్తున్నా ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం సైతం రెండు జేసీబీ యంత్రాలు, పదికి పైగా ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున పట్టపగలే మట్టిని తరలిస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. లక్ష్మీపురం చెరువులో 30, 40 అడుగుల మేర గుంతలు ఏర్పడడంతో ఈ మారు నీరు నిలిచి ఉండే పరిస్థితి లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టి తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..!

చౌడేపల్లె: మండలంలోని నూనెముద్దనపల్లె మార్గంలోని రోడ్డు పక్కనే తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ సరఫరా ఫీజు క్యారేజ్‌లు ఏర్పాటు చేశారు. అసలే రోడ్డు పక్కన మలుపు ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పశువులకు తాకే తక్కువ ఎత్తులో ఉంది. ప్రమాదం సంభవించక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు